సేవ చేసే అవకాశమిచ్చిన సీఎంకు కృతజ్ఞతలు

ప్రధాన సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన సోమేశ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారుగా మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ శుక్రవారం బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలోని ఆరో అంతస్తులో తనకు కేటాయించిన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సోమేశ్‌కుమార్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి రాష్ట్రానికి సేవ చేసే అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా సచివాలయంలోని అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

ఐటీ కొత్త నిబంధనలపై అవగాహన సదస్సు

సాక్షి, హైదరాబాద్: పన్ను మినహాయింపు నిబంధనల్లో వచ్చిన మార్పులను పన్ను చెల్లింపుదారులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు గమనించాలని న్యూఢిల్లీ చీఫ్ కమిషనర్ (మినహాయింపులు) రేణు జౌహ్రీ సూచించారు. ఆదాయపు పన్ను మినహాయింపులో కొత్త, సవరించిన నిబంధనలను వివరించడానికి, హైదరాబాద్ ఏసీగార్డ్స్‌లోని ఆదాయపు పన్ను టవర్స్‌లో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రేణు జౌహ్రీ మాట్లాడుతూ.. ఆదాయపు పన్నులో మినహాయింపు సెక్షన్లలో తెచ్చిన కొత్త నిబంధనలు, సవరణలను తెలిపారు. నాన్ ప్రాఫిటబుల్ ఆర్గనైజేషన్స్ (ఎన్‌పీఓ)ల నమోదులో ఏప్రిల్ 1 నుంచి కొత్త విధానం ప్రారంభమైందని, ఇప్పటికే ఉన్న ఎన్‌పీఓలు, కొత్త ఎన్‌పీఓలు ఏదైనా మినహాయింపును క్లెయిమ్ చేయడానికి కొత్త రిజిస్ట్రేషన్ విధానాన్ని అనుసరించాలని సూచించారు. కొత్త నిబంధనల ప్రకారం, నిర్దిష్ట ఉల్లంఘనలకు పాల్పడితే రిజిస్ట్రేషన్ రద్దు చేయబడుతుందని స్పష్టం చేశారు. మినహాయింపును క్లెయిమ్ చేయడానికి, ఆదాయ రిటర్న్‌లను దాఖలు చేయడం తప్పనిసరని, అవసరమైన ఆడిట్ నివేదికలు, ఇతర నివేదికలను సమయానుకూలంగా సమర్పించాలని వెల్లడించారు. కార్యక్రమంలో జేసీఐటీ (మినహాయింపులు) వి.కోటేశ్వరమ్మ, డీసీఐటీ (మినహాయింపులు) సుధా కొరివి, డీసీఐటీ (మినహాయింపులు) ధృవాష్ట, ఆదాయపు పన్ను అధికారులు, పన్ను బార్ అసోసియేషన్ సభ్యులు, చార్టర్డ్ అకౌంటెంట్లు పాల్గొన్నారు.

అధ్యాపకుడు మధుసూదన్ రెడ్డిని తొలగించండి

ప్రభుత్వానికి ఇంటర్ బోర్డ్ కార్యదర్శి సిఫార్సు

సాక్షి, హైదరాబాద్: సస్పెండైన సరూర్‌నగర్ జూనియర్ కళాశాల అధ్యాపకుడు పి.మధుసూదన్ రెడ్డిని విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలని ప్రభుత్వానికి ఇంటర్మీడియట్ బోర్డ్ కార్యదర్శి నవీన్ మిత్తల్ సిఫార్సు చేశారు. మధుసూదన్ రెడ్డిపై అవినీతితో పాటు, బాధ్యతారాహిత్యం, విధుల్లో క్రమశిక్షణ రాహిత్యం, ఉద్యోగులను బెదిరించడం, మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆరోపణలున్నాయని పేర్కొన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ఆయనను విధుల నుంచి తొలగించడం సరైన నిర్ణయమని ప్రభుత్వ కార్యదర్శికి పంపిన ఫైల్‌లో నవీన్ మిత్తల్ పేర్కొన్నారు.

ఐసీఐడీ వేదికలో భాగస్వామి కండి

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ సాగులో నీటి ఎద్దడి నివారణ అనే థీమ్‌తో నవంబర్ 1 నుంచి 8వ తేదీ వరకు విశాఖపట్నంలో జరగనున్న అంతర్జాతీయ ఇరిగేషన్, డ్రైనేజీ కమిషన్ (ఐసీఐడీ) అంతర్జాతీయ కాంగ్రెస్‌లో భాగస్వామి కావాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఐసీఐడీ ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం ఈఎన్‌సీ మురళీధర్‌ను కలిసి సమావేశం వివరాలను తెలిపారు. 57 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత భారతదేశానికి ఈ అవకాశం వచ్చిందని, విశాఖ వేదిక కానుందని పేర్కొన్నారు.

కొత్త ఫీజు నియంత్రణ చట్టం తీసుకురండి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు అధిక ఫీజుల వసూళ్లను అరికట్టేందుకు కొత్త ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని భారతీయ జనతా యువమోర్చా డిమాండ్ చేసింది. ఫీజు రెగ్యులేటరీ కమిటీలను బలోపేతం చేసి ప్రజాభిప్రాయ సేకరణ ప్రకారం రూపొందించిన నివేదికతో ప్రైవేట్ సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మదన్మోహన్‌కు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్ ఆధ్వర్యంలోని బృందం వినతి పత్రం సమర్పించింది.


కాలులేని భార్యను భుజంపై మోసుకొని..

వరంగల్ ఎంజీఎంలో స్ట్రెచర్‌లేక రోగి అవస్థ • చికిత్సకు వచ్చి వెళ్లే క్రమంలో ఘటన • సోషల్ మీడియాలో వీడియో వైరల్

ఎంజీఎం: వరంగల్ ఎంజీఎంలో స్ట్రెచర్ అందుబాటులో లేక ఓ వృద్ధుడు తన భార్యను చికిత్స అనంతరం భుజాలపై మోసుకెళ్లిన ఘటన శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన మాలోతు లక్ష్మికి నవంబర్‌లో కుడికాలి రక్తప్రసరణ ఆగిపోవడంతో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించి మోకాలు కింద నుంచి కాలును తొలగించారు. రోగిని 15 రోజులకోసారి డ్రెస్సింగ్ కోసం తీసుకురావాలని సూచించారు. ఈ క్రమంలో శుక్రవారం లక్ష్మిని ఆమె భర్త ఆస్పత్రికి తీసుకుచ్చాడు. అక్కడున్న సిబ్బంది 'పెద్ద సార్ లేరు.. రేపు రావాలని చెప్పారు. అయితే ఆ సమయంలో స్ట్రెచర్ అందుబాటులో లేకపోవడంతో భుజాలపై మోసుకుంటూ మండుతున్న ఎండలోనే బయటకు తీసుకెళ్లాడు. ఈ ఘటనపై ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్ స్పందించారు. డ్రెస్సింగ్ అనంతరం పేషెంట్ కేర్ సిబ్బంది రోగిని వీల్‌చైర్‌లో క్యాజువాలిటీ నుంచి బయటకు తీసుకొచ్చారని తెలిపారు. కాలిపర్ (కాలుకు అమర్చే లోహ పరికరం) సేవల కోసం వెళ్లగా శనివారం అందుబాటులో ఉంటుందని, అప్పుడు రావాలని సిబ్బంది చెప్పారన్నారు. దీంతో తిరిగి వెళ్లే క్రమంలో ఎండ తీవ్రత దృష్ట్యా భర్త తన భార్యను ఒక చెట్టు వద్దకు తీసుకెళ్లేందుకు భుజంపై ఎక్కించుకొని వెళ్తుండగా కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారన్నారు. ఇలాంటి ఘటనలతో ఆస్పత్రిని అభాసుపాలు చేయవద్దని కోరారు.

టుడేస్ గ్రాఫిక్

మీకో విషయం తెలుసా? ప్రతి నాలుగు నిమిషాలకు ఈ భూమ్మీద వెయ్యి మంది పుడతారట. అయితే, ఆ వెయ్యి మందిలో ఏ దేశంలో ఎంత మంది జన్మిస్తారు? ఆల్రెడీ జనాభాలో నంబర్ వన్‌గా ఉన్న మనం.. ఈ విషయంలోనూ మొదటి స్థానంలోనే ఉన్నాం. వచ్చే నాలుగు నిమిషాల్లో ఆ వెయ్యిమందిలో 172 మంది భారత్‌లోనే పుడతారట. మరి మిగతా దేశాల సంగతేంటో.. ఓసారి చూద్దామా..



అడవులు కేంద్రంగా ఉగ్రవాద శిక్షణ

- ఆయుధాలు సమీకరించింది మహ్మద్ సలీం
- అక్కడి బృందానికీ ఇతడి ద్వారానే శిక్షణ
- ఈ ఐదుగురి నుంచి విదేశాలకు ఫోన్ కాల్స్

సాక్షి, హైదరాబాద్: నగరంతో పాటు భోపాల్‌లో పట్టుబడిన 16 మంది ఉగ్రవాదులు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతాల్లోనే శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసుకున్నారు. నగర శివార్లలో ఉన్న వికారాబాద్‌లోని అనంతగిరి అడవుల మాదిరిగానే భోపాల్ సరిహద్దుల్లోని రైసెన్ అడవిని ఎంచుకున్నట్లు ఏటీఎస్ అధికారులు నిర్ధారించారు. అక్కడ అరెస్టయిన 11 మందితో పాటు నగరంలో చిక్కిన ఐదుగురినీ ప్రస్తుతం ఏటీఎస్ తమ కస్టడీలోకి తీసుకుని విచారిస్తోంది. -భోపాల్‌లోని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సయ్యద్ డానిష్ అలీ ఇంటిలో సూత్రధారి యాసిర్ ఖాన్ నిర్వహించిన సమావేశాలకు నగరం నుంచి సలీంతో పాటు అబ్దుల్ రెహ్మాన్, షేక్ జునైద్ కూడా హాజరయ్యారని ఏటీఎస్ చెప్తోంది. దానికి సంబంధించిన ఆధారాలు సైతం తమకు లభించినట్లు స్పష్టం చేస్తోంది. గోల్కొండలోని సలీం నివాసంలో ఎయిర్ పిస్టల్, పిల్లెట్స్, భోపాల్‌లోని యాసిర్ ఇంటి నుంచి నాటు తుపాకీ, తూటాలు సీజ్ చేశారు. ఈ నాటు తుపాకీ సేకరించింది, భోపాల్ మాడ్యూల్‌కు శిక్షణ ఇచ్చింది కూడా సలీం అని ఏటీఎస్ అనుమానిస్తోంది. ఆ కోణంలో అతడిని ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది.


నగరంలో అరెస్టు చేసిన ఐదుగురినీ భోపాల్ కోర్టులో హాజరుపరుస్తున్న ఏటీఎస్

విదేశీ నంబర్లకు ఫోన్లపై ఆరా

నగర మాడ్యూల్‌కు చెందిన ఐదుగురు సభ్యుల ఫోన్ల నుంచి విదేశీ నెంబర్లకు ఫోన్లు వెళ్లినట్లు అనుమానిస్తున్న దర్యాప్తు అధికారులు వాటి వివరాలు ఆరా తీస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వీరికి విదేశాల్లో ఉన్న వారితో ఉన్న సంబంధాల పైనా దర్యాప్తు చేయనున్నారు. ఉగ్రవాద సాహిత్యాన్ని తన ల్యాప్‌టాప్ వినియోగించి సొంతంగా తయారు చేసిన సలీం అందులో అనేక అంశాలు చేర్చాడు. ఆన్‌లైన్‌లో ఉన్న విషయాలతో పాటు వివిధ పుస్తకాల్లోని అంశాలు క్రోడీకరించి రూపొందించిన ఇందులో జిహాద్, ముజాహిదీన్ అంటే ఏమిటి? తాము ఏం చేయాలి? అనే వివరాలతో పాటు ఉగ్రవాద చర్యల్లో పాల్గొంటూ చనిపోయిన వారి కుటుంబాలను ఎలా ఆదుకోవాలి? ఎలాంటి ఆయుధాలు సమీకరించుకోవాలి? క్యాడర్‌ను ఎలా రిక్రూట్ చేసుకోవాలి? తదితర వివరాలు పొందుపరిచాడు.

ముగ్గురి ఇళ్లకు సీసీ కెమెరాలు

నగరంలోని వివిధ ప్రాంతాల్లో చిక్కిన ఐదుగురి ఉగ్రవాదుల్లో ముగ్గురి ఇళ్లకు బయట సీసీ కెమెరాలు ఉన్నాయి. మంగళవారం ఉదయం ఏటీఎస్ అధికారులు, పోలీసులు దాడి చేయడానికి వచ్చారనే విషయం వీటిలో చూసి వాళ్లు గుర్తించారు. దీంతో ఉగ్రవాద సాహిత్యం దొరక్కుండా చేయడానికి ప్రయత్నాలు చేశారు.

ఈ కేసులో సాక్షులుగా 'వారు'

సలీం, రెహ్మాన్ గతంలో మరికొందరిని ఆకర్షించారు. వీళ్లు కేవలం మతపరమైన కార్యక్రమాలు చేపడుతున్నారని భావించిన వాళ్లు కొన్ని సమావేశాలకు హాజరయ్యారు. అయితే కొన్నాళ్లకే వీరి వ్యవహారశైలి, కార్యకలాపాలు అనుమానాస్పదంగా భావించిన వారంతా దూరయమ్యారు. వీరిని గుర్తించి, ఈ కేసులో సాక్షులుగా మార్చాలని పోలీసులు భావిస్తున్నారు.

ఈనెల 15 నుంచి సీఎం కప్

- పురుషులు, మహిళలకు వేర్వేరుగా క్రీడలు
- మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు
- గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకేనన్న శాట్స్ చైర్మన్

గన్‌ఫౌండ్రీ: సీఎం కప్-2023 పేరిట ప్రభుత్వం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో క్రీడా సంబరాలను నిర్వహించనుంది, ఈనెల 15 నుంచి 31వరకు వివిధ క్రీడా పోటీలు జరగనున్నాయి.15 ఏళ్ల నుంచి 36 ఏళ్ల వయస్సుగల పురుషులు, మహిళలకు వేర్వేరుగా నిర్వహించే క్రీడలు, వాటి నిర్వహణ, అందులో ఎవరెవరు ఉండాలనే అంశాలను రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) విడుదల చేసింది.

నిర్వహించనున్న క్రీడలు.. : ఈనెల 15 నుంచి 17 వరకు మండల స్థాయిలో, 22 నుంచి 24 వరకు జిల్లా స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. 28 నుంచి 31 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి. మండల స్థాయిలో మహిళలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్ పోటీలు ఉంటాయి. పురుషులకు వాలీబాల్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, రెజ్లింగ్, ఈత పోటీలు నిర్వహించనున్నారు. క్రీడల నిర్వహణకు మండల స్థాయికి రూ.15 వేలు, జిల్లా స్థాయికి రూ.75 ఇవ్వనున్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్వచ్ఛంద సంస్థలు, ఔత్సాహికుల నుంచి నిధులను సమకూర్చుకోవచ్చు.

నగదు ప్రోత్సాహకాలు..

రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందే జట్లకు మొదటి బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.75 వేలు, తృతీయ బహుమతిగా రూ.50 వేలు అందజేస్తారు. వ్యక్తిగత క్రీడల్లో బహుమతిగా ప్రథమ-రూ.20 వేలు, ద్వితీయ-రూ.15 వేలు, తృతీయ-రూ.10 వేల నగదు అందజేయనున్నారు. క్రీడా పోటీల్లో పాల్గొన్నవారికి ప్రశంసా పత్రాలనూ అందజేస్తారు. క్రీడల్లో పాల్గొనాలనుకునేవారు కలెక్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీల్లో పేర్లు నమోదు చేసుకోవాలి. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఈ క్రీడలు నిర్వహిస్తున్నట్లు శాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్ అన్నారు.

బండి కొనిస్తేనే పెళ్లి చేసుకుంటా!

- తాళి కట్టేందుకు మొండికేసిన వరుడు
- బైక్‌కు డబ్బులిచ్చి.. పెళ్లికి ఒప్పించిన ఎమ్మెల్యే రసమయి
- కరీంనగర్ జిల్లాలో ఘటన



శంకరపట్నం(మానకొండూర్): పెళ్లికూతురు మెడలో తాళి కట్టే సమయానికి బండి కొనిస్తేనే పెళ్లి చేసుకుంటా.. అని వరుడు మొండికేయడంతో అతిథిగా వెళ్లిన ఎమ్మెల్యే తానుబండి కొనిస్తా అని డబ్బులు ఇచ్చి వివాహంజరిపించిన ఘటన కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్‌లో చోటుచేసుకుంది. శంకరపట్నం మండలం అంబాల్‌పూర్ మాజీ సర్పంచ్ గాజుల లచ్చమ్మ, మాజీ ఉపసర్పంచ్ మల్లయ్య కూతురు అనూష వివాహం సైదాపూర్ మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన సంఘాల వినయ్‌తో కుదిరింది. రూ.5 లక్షల కట్నంతో పాటు మోటార్ సైకిల్ కొనిస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. కట్నం డబ్బులు ముట్టజెప్పారు. మొలంగూర్ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం పెళ్లి మండపానికి వధువు, వరుడి బంధువులు చేరుకున్నారు. కొత్తజంటను ఆశీర్వదించేందుకు మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కూడా హాజరయ్యారు. తీరా.. తాళికట్టే సమయంలో మోటార్ సైకిల్ కొనిస్తేనే పెళ్లి చేసుకుంటా.. అని వరుడు వినయ్ మొండికేశాడు. దీంతో వరుడు, వధువు బంధువులు గొడవకు దిగడంతో ఎమ్మెల్యే రసమయి జోక్యం చేసుకుని పెళ్లి కొడుకు వినయ్‌తో మాట్లాడి మోటార్ సైకిల్ కొనుక్కోమని సొంత డబ్బులను (సుమారు రూ.50వేలు) అప్పటికప్పుడే పందిట్లోనే అందించారు. మిగతా సొమ్ము కూడా తానే ఇస్తానని హామీ ఇచ్చారు. అనంతరం దగ్గరుండి వివాహం జరిపించి నూతన జంటను ఆశీర్వదించారు. తోడబుట్టిన అన్నగా పెళ్లి మండపంలో పరువు కాపాడావని మాజీ సర్పంచ్ గాజుల లచ్చమ్మ కన్నీరు పెట్టుకుంది.

అజ్ఞాతానికి తెర

- 2004లో మావోయిస్టు దళంలోకి జ్యోతక్క
- కరీంనగర్ పోలీసు కమిషనర్ ఎదుట లొంగుబాటు


శివంగాలపల్లి గ్రామం

కోనరావుపేట(వేములవాడ): రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామానికి చెందిన నేరెళ్ల జ్యోతి అలియాస్ జ్యోతక్క లొంగిపోవడంతో 20 సంవత్సరాల అజ్ఞాతానికి తెర పడినట్లయింది.

మావోయిస్ట్ జ్యోతి నేపథ్యం..

కోనరావుపేట మండలం శివంగాలపల్లికి చెందిన నేరెళ్ల నర్సయ్య- భూదవ్వకు ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు. చిన్న కూతురు జ్యోతి ఐదో తరగతి వరకు స్థానిక పాఠశాలలో, 6-10 వరకు కోనరావుపేట ఉన్నత పాఠశాలలో, ఇంటర్ సిరిసిల్ల ప్రభుత్వ కళాశాలలో చదివింది. 2004లో శివంగాలపల్లిలో అప్పటి దళ కమాండర్ పద్మక్క గ్రామంలో సమావేశం నిర్వహించగా, ఆమె మాటలు విని జ్యోతి ఉద్యమం పట్ల ఆకర్షితురాలైంది. కళాశాలలో చదువుతుండగానే సీవో రఘు ఆధ్వర్యంలో మావోయిస్టులో చేరి అజ్ఞాతంలోకి వెళ్లింది.

20 ఏళ్లలో వివిధ హోదాలు

మావోయిస్టులో చేరిన జ్యోతక్క మొదట మదిమల్ల ఎల్‌జీఎస్ దళ సభ్యురాలిగా ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట, చందుర్తి, కథలాపూర్, నిజామాబాద్ జిల్లా సిరికొండ, భీంగల్ ప్రాంతాల్లో పనిచేసింది. 2011లో కర్రిగుట్ట(ఆదిలాబాద్ జిల్లా)లో జరిగిన ఎన్‌కౌంటర్ తర్వాత ఒడిశా రాష్ట్రానికి వెళ్లింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రెస్ ఇన్‌చార్జిగా పనిచేస్తోంది. పార్టీలో ఉండగానే దినేశ్ అలియాస్ ఎర్రగొల్ల రవిని పెళ్లి చేసుకుంది. అతడి వేధింపులు భరించలేక విడిపోయి ఇన్నాళ్లు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లో వివిధ హోదాల్లో పనిచేసింది.

ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగినా అలజడే..

ఏ రాష్ట్రంలో ఎన్‌కౌంటర్ జరిగినా శివంగాలపల్లిలో అలజడి నెలకొనేది. మృతి చెందింది మహిళా నక్సలైట్ అయితే చాలు తమ జ్యోతే కావొచ్చని తల్లిదండ్రులు ఆందోళన చెందేవారు. పోలీసులు పలుమార్లు కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి జ్యోతి లొంగిపోవాలని కోరారు. తండ్రి నర్సయ్య, సోదరుడు మల్లయ్య మృతి చెందగా మరో సోదరుడు ఆటో నడుపుకుంటూ సాధారణ జీవితం గడుపుతున్నాడు. ఎప్పటికైనా తమ కూతురు రాకపోతుందా అని ఎదురుచూస్తున్న వారి కోరిక ఇన్నాళ్లకు నెరవేరడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇన్విజిలేషన్‌కు వెళ్లలేదు..

- మళ్లీ విధుల్లో చేరారు..
- ఇది ఉపాధ్యాయుల తీరు

జగిత్యాల: జిల్లాలో గత మార్చి 15 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు ఇంటర్ పరీక్షలు నిర్వహించిన విషయం విదితమే. సారంగాపూర్ మండలంలోని పది మంది ఉపాధ్యాయులకు ఈ పరీక్షలకు ఇన్విజిలేషన్ విధులు అప్పగించారు. వారు మార్చి 14న మధ్యాహ్నం 2 గంటల వరకు రిలీవ్ అయి తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాల్లో రిపోర్టు చేశారు. ఇక్కడివరకు బాగానే ఉన్నా కొందరు ఉపాధ్యాయులు పరీక్ష కేంద్రాల్లో పర్యవేక్షణకు వెళ్లలేదు. అటు పాఠశాలకు వెళ్లకుండా, ఇటు పరీక్ష కేంద్రాలకు హాజరు కాకుండానే 15 రోజులు ఎక్కడో గడిపారు. అయితే, మళ్లీ పాఠశాలలో చేరేందుకు హెడ్‌మాస్టర్లు అయితే, ఎంఈవో, ఉపాధ్యాయులైతే హెడ్‌మాస్టర్‌కు రిపోర్టు చేయాలి. ఇందుకోసం తాము ఇంటర్ పరీక్షలకు పర్యవేక్షకులు విధులు నిర్వర్తించినట్లు డ్యూటీ సర్టిఫికెట్లు సమర్పించాలి. కానీ, ఎంఈవోపాటు హెడహస్టార్లకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే విధుల్లో చేరినట్లు తెలిసింది. సుమారు 15రోజుల పాటు ఇన్విజిలేషన్‌కు వెళ్లకుండా, అంటు పాఠశాలలకు హాజరు కాకుండా నిబంధనలు అతిక్రమించిన దుమ్మ టీచర్లు, హెడ్‌మాస్టర్లు వేతనం పొందినట్లు తెలిసింది. ఒకరిద్దరు గైర్హాజరు కావడం, మరికొందరు అసలు పర్యవేక్షణ విధులకే వెళ్లకుండా మళ్లీ స్కూళ్లలో చేరి, వేతనం పొందినట్లు ప్రచారం జరుగుతోంది.

డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వలేదు

ఇంటర్మీడియెట్ పర్యవేక్షకులుగా వెళ్లిన కొద్దిమంది ఉపాధ్యాయులు డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వలేదు. ఈనెల 15లోపు అందజేస్తామని వారు తెలిపారు. ఒకవేళ వారు ఇన్విజిలేషన్ విధులకు హాజరు కాకపోతే చర్యలు తీసుకుంటాం.

– భీమయ్య, ఎంఈవో, సారంగాపూర్

రాజన్న సేవలో ఏడీసీ


దర్శనానికి వెళ్తున్న ట్రిబ్యునల్ అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్‌రావు

వేములవాడ: వేములవాడ రాజన్నను శుక్రవారం రాష్ట్ర దేవాదాయశాఖ ట్రిబ్యునల్ అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్‌రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు. ఆయన వెంట పర్యవేక్షకులు శ్రీరాములు, అల్లి శంకర్, ఏఈ డి.శేఖర్, ఆలయ ఇన్‌స్పెక్టర్ సంకెపల్లి పవన్, ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

'మన బడి' భద్రతకు వాచ్‌మెన్



మన బస్తీ-మనబడిలో ఎంపికైన మంచిర్యాల న్యూ గర్మిళ్ల పాఠశాల

మంచిర్యాలఅర్బన్: వేసవి సెలవుల్లో పాఠశాలల రక్షణకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. దశలవారీగా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, సమగ్ర అభివృద్ధి, పటిష్టత కోసం గ్రామీణ ప్రాంతాల్లో మన ఊరు-మన బడి, పట్టణ ప్రాంతాల్లో మన బస్తీ-మన బడి కార్యక్రమం కింద పనులు చేపట్టింది. ఇప్పటికే కొన్ని పాఠశాలలు అన్ని హంగులతో తీర్చిదిద్దారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ సిస్టం, తాగునీరు, సోలార్ పీవీ సిస్టమ్స్, భోజనశాల ఫర్నిచర్, ఐఎఫ్‌పీఎస్, డ్యూయల్ డెస్కులు, పాఠశాలలకు పెయింటింగ్, గ్రీన్‌చాక్ బోర్డులు వంటి సౌకర్యాలు సమకూర్చారు. పనులు పూర్తి చేసిన ప్రతీ పాఠశాలలో పగలు, రాత్రి కాపలాదారుని నియమించాలని పాఠశాల విద్య డైరెక్టర్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. పాఠశాలలు పునః ప్రారంభమయ్యే వరకు తాత్కాలిక పద్ధతిన వాచ్‌మెన్‌ల నియామకం చేపట్టాలని సూచించారు.

నియామకం.. విధులు ఇలా..

పాఠశాల నిర్వహణ కమిటీ ద్వారా డే, నైట్ వాచ్‌మెన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. వాచ్‌మెన్‌ను నియమించే సమయంలో గత పనితీరు, పూర్వాపరాల ఆధారంగా కాపలాదారున్ని తాత్కాలిక పద్ధతిన విధుల్లోకి తీసుకోవాలి. స్థానికుడై ఉండడంతోపాటు 60 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలనే నిబంధనలున్నాయి. నెలకు రూ.5వేలు గౌరవ వేతనాన్ని ఎంవోఎంబీ, ఎంబీఎంబీ అడ్మినిస్ట్రేటివ్ ఖర్చు నుంచి చెల్లిస్తారు.

జిల్లాల వారీగా..

జిల్లా	పాఠశాల సంఖ్య
ఆదిలాబాద్	32
కుమురంభీం	65
నిర్మల్	88
మంచిర్యాల	85

బాధ్యతలు..

కాపలాదారు పగలు, రాత్రి పాఠశాలల భద్రత చేపట్టాల్సి ఉంటుంది. ఏఎఫ్‌పీల ఇన్‌స్టాలేషన్, బ్యాటీర్ ఆఫ్ ట్యాప్స్, డ్యూయల్ డెస్కులు, డ్రికింగ్, సోలార్ ప్యానల్‌లతోపాటు మొక్కలకు నీరు పెట్టాలని సూచించారు. పాఠశాల ఆవరణలో క్రమం తప్పకుండా చూడడం, వార్డు విధులు, అనధికార వ్యక్తులు పాఠశాలలోకి ప్రవేశించకుండా చూడాల్సి ఉంటుంది. తాత్కాలిక పద్ధతిన నియమించే వాచ్‌మెన్‌కు గౌరవ వేతనాన్ని విడుదల చేసేందుకు నెలవారీ హాజరు అందించాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

బొమ్మలకు శుభమంగళం

- చిన్నారులే పెండ్లి పెద్దలుగా..
- కుమురంభీం జిల్లా తాటిపల్లిలో అట్టహాసంగా బొమ్మల పెళ్లి


తాటిపల్లిలో బొమ్మల పెళ్లి జరిపిస్తున్న చిన్నారులు

కౌటాల(సిర్పూర్): పెళ్లికూతురు అందంగా ముస్తాబైంది. పెళ్లి కుమారుడు మండపంలో కూర్చొని సిద్ధంగా ఉన్నాడు. చిన్నపిల్లలు తోడుగా రాగా.. వధువు సిగ్గుపడుతూ మండపానికి విచ్చేసింది. చిన్నారులే పెండ్లి పెద్దలుగా వ్యవహరించి వేదమంత్రాలతో కల్యాణం జరిపించారు. వధువు, వరుడు వివాహ బంధంతో ఒక్కటయ్యారు. కుమురంభీం జిల్లా కౌటాల మండలం తాటిపల్లిలో గురువారం రాత్రి నిర్వహించిన బొమ్మల పెళ్లిలో కనిపించిన చూడముచ్చటైన దృశ్యమిది. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో ప్రజలు మరాఠా సంప్రదాయాలు పాటిస్తారు. ఏటా సంప్రదాయాలు, వివాహ బంధం, కుటుంబ విలువలపై పిల్లలకు అవగాహన కల్పించేందుకు బొమ్మల పెళ్లిళ్లు నిర్వహిస్తారు. వేసవిలో విద్యాసంస్థలకు సెలవులు రావడం, మంచి ముహూర్తాలు ఉండడంతో తాటిపల్లిలోని హనుమాన్ ఆలయంలో గ్రామానికి చెందిన చిన్నారులు వధువు, వరుడు బొమ్మలను అందంగా అలంకరించి వివాహం జరిపించారు. సంప్రదాయం ప్రకారం గణపతి గజముఖం, మంగళాష్టకాలులను చదువుతూ.. శుభ మంగళ సావధాన్ మంత్రం పఠిస్తూ పెళ్లి తంతు పూర్తి చేశారు. ఈ వేడుక నిర్వహణకు చిన్నారులే నగదు జమ చేసుకుని ఖర్చు భరించడం విశేషం. వివాహం అనంతరం విందు సైతం ఏర్పాటు చేశారు.

ప్రశాంతంగా ఇంజినీరింగ్ ఎంసెట్


పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

తిమ్మాపూర్: ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం ఎంసెట్ పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు ప్రభుత్వం పకడ్బందీగా పరీక్షను నిర్వహిస్తోంది. ఈ నెల 12వ తేదీనాటి పరీక్ష ఉమ్మడి జిల్లాలోని వాగేశ్వరి అయాన్ డిజిటల్ జోన్, వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాల, జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల, శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో 2 కేంద్రాలు, కరీంనగర్‌లోని వివేకానంద, అల్ఫోర్స్, హుజూరాబాద్‌లోని కిట్స్ కళాశాలలో సెంటర్లు ఏర్పాటు చేశారు. రెండు సెషన్లలో ఉదయం 9 గంటల నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 3గంటల నుంచి 6 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. గంటన్నర ముందే పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఇచ్చారు. విద్యార్థుల హాల్ టికెట్ బార్ కోడింగ్ ద్వారా పరీక్షించి కేంద్రంలోకి అనుమతిచ్చారు. జ్యోతిష్మతిలో 80 మంది విద్యార్థులకు ఉదయం, మధ్యాహ్నం 78మంది హాజరయ్యారు. వాగేశ్వరి అయాన్ డిజిటల్ సెంటర్లో 722 మంది విద్యార్థులకు ఉదయం 696మంది, మధ్యాహ్నం 701మంది హాజరయ్యారు. వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో 110మంది విద్యార్థులకు ఉదయం 107 మంది, మధ్యాహ్నం 108మంది హాజరయ్యారు. శ్రీ చైతన్య 1 కళాశాలలో ఉదయం 80మందికి 79మంది హాజరుకాగా, మధ్యాహ్నం 80మంది హాజరయ్యారు. శ్రీ చైతన్య-2లో ఉదయం 200 మంది విద్యార్థులకు 196మంది, మధ్యాహ్నం 195మందికి హాజరయ్యారు. అల్ఫోర్స్‌లో 55మందికి ఉదయం 52మంది, మధ్యాహ్నం 55మంది హాజరయ్యారు. హుజూరాబాద్ కిట్స్ కళాశాలలో ఉదయం 90మందికి 88మంది హాజరుకాగా, మధ్యాహ్నం 86మంది హాజరయ్యారు. వివేకానందలో 105మందికి ఉదయం 104మంది, మధ్యాహ్నం 103 హాజరయ్యారు. పరీక్ష కేంద్రం వద్ద ఎస్ఐ ప్రమోద్ రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిర్మానుష్యంగా.. సుంకిడి


నిర్మానుష్యంగా మారిన గ్రామం


పోలీసుల బందోబస్తు

తలమడుగు: నిత్యం స్థానికులతో రద్దీగా ఉండే సుంకిడి గ్రామం శుక్రవారం నిర్మానుష్యంగా మారింది. గ్రామస్తులంతా ఐదేళ్లకోసారి చాందా గ్రామంలోని శ్రీ మహాలక్ష్మిదేవి అమ్మవారి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయాన్నే వీరంతా అక్కడికి వెళ్లారు. పూజల అనంతరం అక్కడే వండుకొని భోజనా లు చేశారు. రాత్రి ఇళ్లకు చేరుకున్నారు. కాగా, ఊరంతా ఖాళీ కావడంతో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గ్రామస్తులతో కలిసి ఎ మ్మెల్యే రాథోడ్ బాపూరావు, మాజీ ఎంపీ నగేశ్ స ర్పంచ్, మహేందర్ తదితరులు వెళ్లారు.

సాక్షి రాజన్న సిరిసిల్ల

సోమవారం ၊ 1 ၊ మే ၊ 2023



'కవనం' కవర్‌పేజీ ఆవిష్కరణ

ముస్తాబాద్(సిరిసిల్ల): ఆవునూర్‌కు చెందిన రచయిత గంగాడి సుధీర్ కవితా సంకలనం 'కవనం' కవర్ పేజీని మంత్రి గంగుల కమలాకర్ ఆదివారం ఆవిష్కరించారు.



పోచమ్మ బోనాలు

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో ఆదివారం పోచమ్మ బోనాలు తీశారు. రేణుక ఎల్లమ్మ సిద్దోగంలో భాగంగా అంబేడ్కర్‌నగర్ మహిళలు ఆదివారం పోచమ్మకు బోనాలు తీశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.0/22.0

జిల్లాలో తేలికపాటి వర్షాలు కురుస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడే 'సాక్షి' ఆధ్వర్యంలో ఉచిత డ్యాన్స్ శిబిరం

సిరిసిల్లటౌన్: 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో చిన్నారులు, విద్యార్థుల కోసం సోమవారం నుంచి ప్రత్యేకంగా ఉచిత డ్యాన్స్ శిక్షణ శిబిరం నిర్వహిస్తుంది. మే 1 నుంచి 3వ తేదీల్లో పిల్లలకు ప్రముఖ డ్యాన్స్‌మాస్టర్ పాందుర్తి ధర్మేందర్ శిక్షణ ఇవ్వనున్నారు. పాత పెట్రోల్‌బంక్ ఎదురు కాలనీలోని ఇంగ్లిష్ యూనియన్ స్కూల్‌లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఉచిత డ్యాన్స్ శిక్షణ తరగతులు కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, స్థానిక కౌన్సిలర్ జాగీరు శైలు ప్రారంభించనున్నారు. ఆసక్తి గల చిన్నారులు, విద్యార్థులు డ్యాన్స్‌మాస్టర్ పాందుర్తి ధర్మేందర్‌ను 95733 99404, ఇంగ్లిష్ యూనియన్ స్కూల్ కరస్పాండెంట్ రాజ్‌కుమార్‌ను 98665 48054 నంబర్లలో సంప్రదించవచ్చు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

పంచాయతీ అవార్డు వెనక్కి ఇచ్చిన సర్పంచ్



అవార్డు వెనక్కి ఇస్తున్న పద్మనగర్ సర్పంచ్ ముదారి పోచయ్య

తంగళ్లపల్లి(సిరిసిల్ల): జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు సమ్మెకు మద్దతుగా రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని పద్మనగర్ సర్పంచ్ ఇటీవల పంచాయతీకి వచ్చిన జిల్లా స్థాయి పురస్కారాన్ని వెనక్కి ఇచ్చారు. ఈమేరకు తంగళ్లపల్లిలో సమ్మెచేస్తున్న జేపీఎస్, ఓపీఎస్‌లకు ఆదివారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముదారి పోచయ్య మాట్లాడుతూ జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలని, ఓపీఎస్‌లకు పదోన్నతులు కల్పించాలని కోరారు. గ్రామపంచాయతీకి జిల్లా స్థాయిలో వచ్చిన అవార్డును ఇన్‌చార్జి ఎంపీవో శ్రీధర్‌రెడ్డికి అందించారు. జేపీఎస్‌లు రెగ్యులరైజ్ అయ్యే వరకు మద్దతుగా గ్రామపంచాయతీకి తాళం వేస్తున్నట్లు ప్రకటించారు. పద్మనగర్ సర్పంచ్ ముదారి పోచయ్య, ఇన్‌చార్జి ఎంపీవో శ్రీధర్‌రెడ్డి, జేపీఎస్ మండలాధ్యక్షుడు జనార్దన్, అధ్యక్షురాలు మమతరెడ్డి, జేపీఎస్, ఓపీఎస్‌లు పాల్గొన్నారు.

మన్ కీ బాత్‌తో పథకాలపై అవగాహన



ఫాజుల్‌నగర్‌లో హాజరైన గ్రామస్తులు

వేములవాడరూరల్: మన్ కీ బాత్ ప్రోగ్రాంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు, దేశాభివృద్ధి గురించి ప్రధాని మోదీ వివరించారు. మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్‌ను ఫాజుల్‌నగర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ హాజరయ్యారు. ఎంపీపీ బండ మల్లేశం, పార్టీ మండలాధ్యక్షుడు తిరుపతి, నాయకులు గంగుల ప్రసాద్, మధుకర్, గుడిసె రమేశ్ పాల్గొన్నారు.

కార్మికులకు హెల్త్‌క్యాంపు

సిరిసిల్ల: జిల్లాలోని గుర్తింపుకార్డులు పొందిన భవన నిర్మాణ కార్మికులకు ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా సహాయ కార్మిక అధికారి రఫీ ఆదివారం తెలిపారు. కార్మిక దినోత్సవం సందర్భంగా మే 1 నుంచి 3వ తేదీ వరకు హెల్త్‌క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రక్తపోటు, షుగర్, కంటి, రక్త, మూత్ర, ఊపిరితిత్తులు, ఈసీజీ, చెవి పరీక్షలు ఉచితంగా చేస్తారని పేర్కొన్నారు. సిరిసిల్లలోని శాంతినగర్‌లోని న్యాక్ శిక్షణ కేంద్రంలో హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు సీఎస్‌సీ ఈ హెల్త్ ఇన్‌చార్జి మహేందర్‌ను 83749 06690లో సంప్రదించాలని కోరారు.

జాతరలా జనం



వేములవాడ: వేసవి సెలవులు కొనసాగుతుండడంతోపాటు ఆదివారం కావడంతో రాజన్నను దర్శించుకునేందుకు 30 వేల మంది భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం జనంతో కిక్కిరిసి పోయింది. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఏఈవో శ్రీనివాస్, ప్రతాప నవీన్, పర్యవేక్షకులు తిరుపతిరావు, అల్లి శంకర్, శ్రీరాములు భక్తుల ఏర్పాట్లను పరిశీలించారు. పోలీసులు పట్టణంలో, ఆలయ ఎస్పీఎఫ్ సిబ్బంది ఆలయ పరిసరాల్లో బందోబస్తు నిర్వహించారు.

నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం

- పనికిరాని చట్టాలు.. కానరాని కనీస వేతనాలు
- కార్మిక హక్కుల సాధనకు తప్పని పోరాటాలు
- శ్రమదోపిడీపై స్పందించని ప్రభుత్వాలు
- ఉమ్మడి జిల్లాలో కార్మికుల పరిస్థితి ఇదీ..



ఆగని వలసలు.. సాగని బతుకులు

కరీంనగర్: బుక్కెడు బువ్వ కోసం బతుకు పోరాటం.. కుటుంబపోషణకు ఆరాటం.. ఎండనకా.. వాననకా.. చలనకా.. రక్తాన్ని స్వేదంగా చిందించి పొద్దంతా శ్రమిస్తే వచ్చే కూలి ఒక్కపూట తిండికి సరిపోని పరిస్థితి. ఉన్న ఊరిలో ఉపాధి కరువై.. బతుకు బరువై తెలియని ప్రాంతానికి వలసవెళితే అక్కడా తప్పని శ్రమదోపిడీ. వేకువజాము నుంచి సందెవేళ దాకా శ్రమించినా కష్టాల ఊబినుంచి కార్మికులు బయటకు రాలేకపోతున్నారు. పాలకులు మారినా.. శ్రామికుల తలరాతలు మారడం లేదు. శ్రమకు తగ్గ ప్రతిఫలం లేక అర్ధాకలితో అలమటించే వారు కోకొల్లలు. ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో కనీస వేతన చట్టం, పనివేళలు బుట్టదాఖలు. ఉమ్మడి కరీంనగర్‌జిల్లా నుంచి వేలాది మంది కార్మికులు గల్ఫ్ దేశాలకు వలస వెళ్తుండగా.. జిల్లాకు సైతం వివిధ పనుల కోసం ఇతర రాష్ట్రాల వాళ్లు వస్తున్నారు. స్థానికంగా వేలాదిమంది వివిధ రంగాల్లో పనిచేస్తుండగా.. వచ్చే వేతనం అంతంతే.. నేడు మేడే సందర్భంగా ఉమ్మడి జిల్లాలో కార్మికుల జీవన పరిస్థితి, అభిప్రాయాలతో ప్రత్యేక కథనం..

వలస కార్మికుల పరిస్థితి అగమ్యగోచరం

కరీంనగర్ జిల్లాలో భవన నిర్మాణ, గ్రానైట్, తదితర రంగాల్లో 85వేల మందికిపైగా వలసకూలీలు ఉన్నారు. స్థానికులు 2లక్షలకు పైగానే ఉన్నారు. కార్మికశాఖ లెక్కల ప్రకారం ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలు ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ ఉంటేనే జిల్లాలో కార్మికుడిగా గుర్తింపు పొందే అవకాశం ఉంది. వలస వచ్చే కార్మికులకు అలాంటి అవకాశాలు లేకపోవడంతో అనధికారికంగా ఏజెంట్ల వద్ద పనిచేస్తూ సంవత్సరానికి కాంట్రాక్టు మాట్లాడుకుని పొట్ట పోసుకుంటున్నారు. జిల్లాలో ఇటుకబట్టీల్లో ఒడిశా కార్మికులు 3వేల మందికిపైగా ఉన్నారు. ప్లంబర్, పీవోపీ పనుల కోసం రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ కార్మికులు, లేబర్ పనుల కోసం ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రకు చెందినవారు 30వేల మందికిగాపైగా ఇక్కడ జీవనోపాధి పొందుతున్నారు. ఇంటి నిర్మాణ మేస్త్రీలుగా ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు పదివేల కుటుంబాలకు చెందిన వారు ఉన్నట్లు సమాచారం. జిల్లాలో 550కిపైగా గ్రానైట్ క్వారీల్లో తమిళనాడు, మధ్యప్రదేశ్, మహారాష్ట్రకు చెందిన వారితో పాటు స్థానికులు కూడా పదివేల మందివరకు పనిచేస్తున్నారు. అరకొర వేతనాలతో ఒకపూట పస్తులుండి కాలం వెళ్లదీస్తున్న కుటుంబాలెన్నో. కార్మికులకు సౌకర్యాలు కల్పించాలని గ్రానైట్‌వర్కర్స్ యూనియన్ చేస్తున్న పోరాటం నిరంతరం కొనసాగుతూనే ఉంది. వలస కార్మికులు పనిచేసే చోట ప్రమాదవశాత్తు మరణిస్తే అధికారికంగా ఎలాంటి సాయం అందడం లేదు.

నేడు ఎగరనున్న ఎర్రజెండా..

చికాగోలో 8 గంటల పని దినాన్ని కల్పించాలని కోరుతూ కార్మికులు 1848లో పెద్దఎత్తున ఆందోళన చేశారు. ప్రభుత్వం వారిపై కాల్పులు జరపగా ఏడుగురు చనిపోయారు. ఏ మాత్రం వెనక్కు తగ్గని కార్మికులు రక్తంతో తడిసిన వారి చొక్కాలనే జెండాలుగా చేసి మే 1న భారీ ప్రదర్శన నిర్వహించారు. వారి పోరాట ఫలితంగా రోజుకు 8గంటలు మాత్రమే పని సమయం నిర్ణయించారు. ఆ పోరాటంలో వీరమరణం పొందిన వారికి చిహ్నంగా ఏటా మే 1వ తేదీని మేడేగా ప్రకటించారు. మేడే సందర్భంగా సోమవారం ఉమ్మడి జిల్లాలోని వివిధ కార్మిక సంఘాలు, వామపక్షపార్టీల ఆధ్వర్యంలో వారివారి కార్యాలయాల్లో, పనిస్థలాల్లో జెండా ఆవిష్కరణలు, సభలు, సమావేశాలు అట్టహాసంగా నిర్వహించుకునేందుకు సిద్ధమవుతున్నారు.

చిన్న జిల్లా.. ఉపాధికి అడ్డా



సిరిసిల్లటౌన్: తెలంగాణాలోనే అతిచిన్న జిల్లాగా ఏర్పడిన రాజన్న సిరిసిల్ల శ్రామికుల ఉపాధికి అడ్డాగా మారింది. వ్యవసాయం, వస్త్రోత్పత్తి, హమాలీ తదితర రంగాల్లో మొత్తంగా 1.60లక్షల మంది రిజిష్టర్డ్ కార్మికులు పనిచేస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి 2లక్షలకు పైగా కార్మికులు పనిచేస్తున్నారు. 2000 ఏడాదికి అంతకుముందు సిరిసిల్ల డివిజన్ (ప్రస్తుతం జిల్లా)లో కరువు కాటకాలతో ముంబయి, దుబాయ్ వలసలు వెళ్లారు. ప్రస్తుతం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు రాష్ట్రసర్కారు ఆర్డర్లు, ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు, వివిధ కంపెనీల ఆర్డర్లు రావడంతో ఉపాధి పెరిగింది. ఫలితంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికులు వస్త్రోత్పత్తిలో పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. జిల్లాలోని భవన నిర్మాణ రంగమూ విస్తరించడంతో కార్మికులకు డిమాండ్ పెరిగింది. భవననిర్మాణ రంగంలో స్థానికులు 42,000 మంది, వలస కార్మికులు 5వేల మంది పనిచేస్తున్నారు. చేనేతరంగంలో స్థానికులు 16వేల మంది, వలస కార్మికులు వెయ్యిమంది ఉన్నారు. హమాలీ రంగంలో స్థానికులు 6వేలు, 2వేల మంది వలస కార్మికులు ఉన్నారు.

రోజువారీ కూలీలుగా..



సుల్తానాబాద్/జ్యోతినగర్: పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ రామగుండం పరిధిలో వందలాది మంది వలస కార్మికులు పనిచేస్తున్నారు. ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, ఇతర పారిశ్రామిక ప్రాంతాల్లో రోజువారీ కూలీలుగా కొనసాగుతున్నారు. అత్యధికంగా రైస్‌మిల్లులు ఉన్న సుల్తానాబాద్, మంథని, కమాన్‌పూర్ ప్రాంతాల్లో బిహార్ కార్మికులు ఎక్కువగా పనిచేస్తున్నారు. జిల్లాలోని సుమారు 150 రైస్‌మిల్లుల్లో 7,500 మంది వరకు బిహారీలు ఉపాధి పొందుతున్నారు. రోజంతా కష్టపడితే వచ్చేది రూ.500 నుంచి రూ.వెయ్యి మాత్రమే. జిల్లాలోని ఇటుకబట్టీల్లో కార్మికుల పరిస్థితి అధ్వానం. 50కి పైగా ఇటుకబట్టీలు ఉండగా.. వందలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఒక్కోసారి వీరికి కనీసం తిండి పెట్టడంలేదని ఆందోళనకు దిగిన సందర్భాలు ఎన్నో. అధికారులు ఎన్నిచర్యలు తీసుకుంటున్నా.. యజమానులు ఇప్పటికీ వారిని బానిసల్లాగానే చూస్తుండడం ఆందోళనకరం.

వేతన ఒప్పందం ఏదీ?



గోదావరిఖని: 11వేజ్‌బోర్డు పూర్తిస్థాయి ఒప్పందం కోసం సింగరేణి కార్మికులు ఎదురు చూస్తున్నారు. జిల్లాలోని రామగుండం రీజియన్ ఆర్జీ–1,2,3 ఏరియాల్లో సుమారు 11,500మంది పనిచేస్తున్నారు. గత సమావేశంలో మూలవేతనంపై 19శాతం పెంచేందుకు యాజమాన్యం అంగీకరించింది. అయితే అలవెన్స్ పెంపుపై ఎలాంటి ఒప్పందం కుదరలేదు. ఏప్రిల్ 18న కోల్‌కత్తాలో జరిగిన జేబీసీసీఐ 11వ వేజ్ బోర్డు 9వ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. పూర్తిస్థాయి వేతన ఒప్పందం కోసం తిరిగి సమావేశం కావాలని నిర్ణయించాయి. మారుపేర్ల మార్పు, విజిలెన్స్ కేసుల క్లియరెన్స్, అండర్‌గ్రౌండ్‌లో అన్‌ఫిట్ అయిన కార్మికులు సర్ఫేస్‌లో అదే ఉద్యోగం ఇస్తూ వేజ్‌ప్రొటక్షన్ తదితర డిమాండ్ల పరిష్కారంపై కార్మికులు ఎదురుచూస్తున్నారు. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారు. కోలిండియా మాదిరిగా సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీసవేతనాలు అందడం లేదు. జిల్లా పరిధిలోని సింగరేణిలో సుమారు నాలుగువేల మంది కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు.

అటు నుంచి ఇటు.. ఇటు నుంచి అటు

కథలాపూర్(వేములవాడ): ఉన్న ఊరిలో సరైన ఉపాధిలేక పలువురు జిల్లా వాసులు ఉపాధిని వెతుక్కుంటూ అప్పులు చేసి వీసాలు కొనుగోలు చేసి ఇప్పటికీ గల్ఫ్ బాటపడుతున్నారు. అక్కడ సరైన ఉపాధి దొరక్కపోవడంతో అప్పు తీర్చేందుకు అరకొరవేతనాలతో కొందరు నెట్టుకొస్తుండగా.. మరికొందరు కొన్నిరోజులకే ఇంటిబాట పడుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో పనులు లేక కూలీలు పనుల కోసం జగిత్యాల జిల్లాకు వస్తున్నారు. జిల్లాకు వలస వస్తున్న కూలీలు ఎక్కువగా కొనుగోలు కేంద్రాల్లో హమాలీలుగా, వరినాట్లు వేసేందుకు వస్తున్నారు. భవన నిర్మాణాల కోసం కూలీలు, మేస్త్రీలుగా ఎక్కువగా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి వస్తున్నారు. జిల్లానుంచి లక్ష మందికి పైగా గల్ఫ్‌దేశాలకు ఉపాధికోసం వెళ్తుండగా.. ఇతర రాష్ట్రాల వాళ్లు దాదాపు 2,500 మంది ఇక్కడి పనిచేస్తున్నారు.

నేను రైతును.. గల్ఫ్‌బాట పట్టిన



నాలుగు ఎకరాల భూమిలో సాగుచేసిన. బోర్లు వేస్తే చుక్కనీరు రాలే. ఏళ్లుగా చూసిన ఏ ప్రాజెక్టు నీళ్లు మా శివారులకు చేరలే. వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీరకపోవడంతో గల్ఫ్ బాట పట్టిన. దుబాయిలో వాహనాల తయారీ కంపెనీలో కార్మికుడిగా పనిలోచేరిన. పని కష్టమైనప్పటికి డబ్బుల కోసం కష్టాన్ని దిగమింగుకునే పరిస్థితి నెలకొంది. గది, భోజనాల ఖర్చులు పోను నెలకు రూ.12 వేలు మిగులుతున్నాయి. గల్ఫ్ వలస కార్మికులతోపాటు రైతులు, కార్మికుల సంక్షేమాల కోసం ప్రభుత్వాలు ఆలోచించాలి. – పిడుగు రమేశ్, తాండ్రియాల, కథలాపూర్

పేర్లు నమోదు చేసుకోవాలి



ఇతరరాష్ట్రాల నుంచి జిల్లాకు వస్తు న్న వలస కూలీలు ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్‌తో తాము పనిచేస్తున్న యాజమాని అనుమతి తో కార్మికశాఖ కార్యాలయంలో పేరు నమోదుచేసుకోవాలి. చాలా మంది వలస కూలీలు ఇతరత్రా పనుల కోసం వస్తూ ఏడాది కాంట్రాక్ట్ ముగియగానే వారి యజమాని ఇచ్చిన డబ్బులు తీసుకుని వెళ్లిపోతుంటారు. కార్మికశాఖ కార్యాలయంలో గుర్తింపు పొందినకార్డులు తీసుకున్న వారే ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులు.

– ఎస్.రమేశ్‌బాబు, ఉప కార్మిక కమిషనర్, కరీంనగర్

ఏడాదిలో ఎనిమిది నెలలు ఇక్కడే



మాది బిహార్. సుల్తానాబాద్‌లో రైస్‌మిల్ హమాలీగా పని చేస్తున్నా. వానాకాలం వేసవికాలం కలిపి ఎనిమిది నెలలు ఇక్కడ ఉపాధి దొరుకుతుంది. మిగితా నాలుగు నెలలు సైతం ఇక్కడే ఉండాలని యజమాని చెప్పినప్పటికీ భార్య, పిల్లల కోసం వెళ్లివస్తాం. వారానికోసారి ఇంటికి డబ్బులు పంపిస్తాను. – మంటూ చౌదరి, హమాలీ

క్యాంపులో ఉంటూ..



మా రాష్ట్రం నుంచి వచ్చినవాం ఇక్కడ క్యాంపులో ఉంటాం. కంపెనీ వాహనంలోనే ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టుకు వెళ్లి పనులు చేసి వస్తాం. నేను ఫిట్టర్‌గా పని చేస్తాను. వలస కార్మికులకు కొంతఎక్కువ మొత్తంలో జీతం చెల్లించాలి. ప్రత్యే క చట్టం చేసి వేతనాలు పెంచేవిధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

– రాజన్, ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు, బిహార్

సిరిసిల్లలో ఎక్కువ కూలి



మాది కామారెడ్డి జిల్లా భవానిపేట.ఎనిమిదేళ్లుగా సిరిసిల్లకు వచ్చి భవన నిర్మాణ కార్మికుడిగా చేస్తున్నా. మా ఏరియాలో ఒక్క రోజుకు రూ.600కూలీ వస్తుంది. ఇక్కడ రూ.800 ఇస్తుండ్రు. నా భార్య లత బీడీలు చేస్తుంది. ఇద్దరం రెక్కల కష్టంతో కొడుకు నితిన్‌ను చదివించుకుంటున్నం. – గద్దం శివ, భవానిపేట, కామారెడ్డి

దంచికొట్టిన వడగండ్లు



రుద్రంగిలో తడిసి ముద్దయిన వరిధాన్యం



తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్‌లో మొలకలు వచ్చిన ధాన్యం చూపుతున్న రైతు



కొదురుపాకలో తడిసిన ధాన్యం వద్ద రైతులు

- ఉన్నదంతా ఊడ్చుకుపోయింది
- చేనులో మిగిలింది గడ్డే..
- బోరుమన్న అన్నదాతలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): జిల్లాలో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. ఈదురుగాలులకు పలు పల్లెల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తంగళ్లపల్లి మండలంలోని లక్ష్మీపూర్ కొనుగోలు కేంద్రంలో సిరికొంటి తిరుపతిరెడ్డికి చెందిన 4 క్వింటాళ్ల వడ్లు మొలకెత్తాయి.

కొదురుపాకలో తడిసిన ధాన్యం

బోయినపల్లి(చొప్పదండి): కొదురుపాక, వెంకట్రావుపల్లి, నీలోజిపల్లిల్లో ఈదురు గాలులతో కురిసిన వర్షంతో కొనుగోలు కేంద్రాలోని ధాన్యం తడిసింది. నీలోజిపల్లిలో వడగండ్ల వాన కురిసింది.

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండలంలో వడగండ్లు బీభత్సం సృష్టించాయి. కోతకు సిద్ధమైన వరిపంట ధ్వంసమైంది. కేంద్రాల్లోని ధాన్యం కొట్టుకుపోయింది. పొలాల వద్ద ఉన్న రైతులు వడగండ్లకు గాయపడ్డారు.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలంలో ఈదురుగాలులతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. కొనుగోలు కేంద్రాల్లో రైతులు నిల్వచేసిన ధాన్యం తడిసింది. నారాయణపూర్, రాగట్లపల్లి, దుమాల, అక్కపల్లి, పదిర, హరిదాస్‌నగర్, గొల్లపల్లి, బొప్పాపూర్‌లలో వరిపంట నేలవాలింది.

చందుర్తి(వేములవాడ): మండలంలో మళ్లీ వడగండ్ల వాన కురిసింది. మల్యాల, చందుర్తి, రామన్నపేట, తిమ్మాపూర్, ఆశిరెడ్డిపల్లె, నర్సింగాపూర్ గ్రామాల్లో వడగండ్ల వాన కురిసింది. కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. ఇప్పటికే మండలంలో 760 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. ఆదివారం కురిసిన వర్షంతో నష్టం రెండింతలు పెరిగే అవకాశాలు ఉన్నాయి.

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం నామాపూర్, గూడెం, ఆవునూరు, కొండాపూర్, చిప్పలపల్లి గ్రామాల్లో వరిపంట దెబ్బతింది. గూడెం, నామాపూర్ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది.



వాసవీమాతా నమస్తుభ్యం

సిరిసిల్లటౌన్: వాసవి కన్యకాపరమేశ్వరీ జయంతి ఉత్సవాలు ఆదివారం కనులపండువగా జరిగాయి. జిల్లా, పట్టణ ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. శతకలశ పూజ, అభిషేకం, శ్రీచక్రచతుష్షష్టి ఉపచార పూజ, కోటి పుష్పార్చన, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. సాయంత్రం నీలం రంగు చీరలు ధరించి మహిళలు పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లాడి శ్రీనివాస్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అల్లాడి సరస్వతి, రాజూరి వాసుదేవరాయలు, కటుకం సత్తయ్య, కొత్తపల్లి శ్రీనివాస్, పోకల శేఖర్, యెల్లంకి వాణి, చేపూరి జమున, ఎల్లంకి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థి ప్రతిభ


కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి

కోనరావుపేట: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో మండలంలోని నిజామాబాద్‌కు చెందిన కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి 98.48 శాతం సాధించారు. గ్రామానికి చెందిన కేతిరెడ్డి మహేందర్ రెడ్డి –హేమలత కుమారుడు హర్షవర్ధన్ రెడ్డి ఇంటర్మీడియట్ చదువుతూనే జేఈఈ మెయిన్స్‌లో శిక్షణ పొందాడు. ఎన్‌టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) ఆధ్వర్యంలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్ 2023లో 98.48 శాతం సాధించాడు. ఈ సందర్భంగా హర్షవర్ధన్‌ను సర్పంచ్ కేతిరెడ్డి అరుణ, మాజీ సర్పంచ్ కేతిరెడ్డి రవీందర్ రెడ్డి, సెస్ మాజీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, గ్రామస్తులు అభినందించారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

బోయినపల్లి (చొప్పదండి): ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ బహిరంగ సభ విజయవంతం కోసం రూపొందించిన పోస్టర్‌ను మండలకేంద్రంలో ఆదివారం మండల అధ్యక్షుడు అలువాల అజయ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొంకటి శేఖర్ మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యం రావాలంటే బహెన్ మాయావతి నేతృత్వంలో పనిచేస్తున్న బీఎస్పీకే సాధ్యమన్నారు. కార్యక్రమంలో అలువాల అజయ్, ఉల్లెందుల అరుణ్, కన్నం అనిల్, పెగ్గెర్ల మహేందర్, బొడ్డు రాజలింగం, మణిదీప్, పొత్తూరి శేఖర్, రమేశ్, ఈశ్వర్, చిన్నా, లడ్డు, అభి, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గానికి అభినందనలు

జగిత్యాల : తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా మామిళ్ల రాజేందర్, జగదీశ్వర్ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోగ శశిధర్, నాగేందర్ రెడ్డి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అమరేందర్ రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

కేజీబీవీ ఉద్యోగులకు వేసవి సెలవులు ఇవ్వాలి

జగిత్యాల: కేజీబీవీ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు కూడా వేసవి సెలవులు వర్తింపజేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుకోవెల శ్యామ్‌సుందర్, అంబటి భూమేశ్వర్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఏడాదిలో 12నెలల వేతనం చెల్లిసుతన్నామని, వేసవి సెలవుల్లోనూ రోజూ విధులకు హాజరు కావాల్సిందేనని సమగ్ర శిక్షా ప్రాజెక్ట్ డైరెక్టర్ హుకుం జారీచేయడం శోచనీయమన్నారు. ప్రతిరోజు పాఠశాలలో బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని, సగంమంది బడిలో ఉండాలని, మిగిలినవారు గ్రామాల్లో పర్యటించాలనే ఆదేశాలను ఉపసంహరించుకోవాలన్నారు. వేసవిలో ఎండలు మండిపోతున్నాయని, పిల్లలు లేకుండా ప్రతీరోజు పాఠశాలకు వచ్చి చేసేది ఏమి ఉంటుందని ప్రశ్నించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురిపై కేసు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మద్యంతాగి వాహనాలు నడిపిన ముగ్గురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై శేఖర్ తెలిపారు. మండలంలోని రాచర్ల గొల్లపల్లి శివారులోని మూడు గుళ్ల వద్ద తనిఖీ చేపట్టగా మద్యంతాగి వాహనాలు నడుపుతూ ముగ్గురు పట్టుబడినట్లు తెలిపారు. మద్యంతాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్టడీ సర్కిళ్లలో ఉచిత శిక్షణ

- గ్రూప్స్‌తోపాటు ఇతర పోటీ పరీక్షలకు తర్ఫీదు
- దరఖాస్తులు ఆహ్వానిస్తున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ సర్కిళ్లు
- ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఫౌండేషన్ కోర్సుకు గత 27న నోటిఫికేషన్
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉద్యోగార్థులకు సదవకాశం



ఎస్సీ స్టడీ సర్కిల్ భవనం

కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం వరుస ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తున్న నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ స్టడీ సర్కిళ్లు ఉచిత శిక్షణకు సిద్ధమవుతున్నాయి. బీసీ, ఎస్సీ, ఎస్టీ స్టడీ సర్కిల్స్‌లో ఉచిత శిక్షణ తరగతులు కొనసాగుతుండగా తాజాగా ఎస్సీ స్టడీ సర్కిల్‌లో వంద సీట్ల భర్తీ కోసం ఐదు నెలల ఫౌండేషన్ కోర్సు ప్రారంభించేందుకు గత నెల 27న నోటిఫికేషన్ విడుదలైంది. ఆయా స్టడీ సర్కిళ్లు ఇప్పటికే వాట్సాప్, టెలిగ్రాం యాప్‌ల ద్వారా ఉద్యోగార్థులకు శిక్షణ ఇస్తుండగా, ప్రభుత్వ ఆదేశాలతో ప్రత్యక్ష తరగతులు నిర్వహించాలని నిర్ణయించి, నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాయి.

ఎస్సీ స్టడీ సర్కిల్ పరిధిలో..

అంబేడ్కర్ స్టడీ మెమోరియల్ ద్వారా ఎస్సీ నిరుద్యోగ అభ్యర్థులకు ఎస్సీ అభివృద్ధి శాఖ ఉచిత శిక్షణనిస్తోంది. కలెక్టరేట్ రోడ్‌లో గల అంబేడ్కర్ భవన్‌లోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఇప్పటికే గ్రూప్–1, 2, 3, 4, బ్యాంకింగ్, ఆర్‌ఆర్‌బీ(రైల్వే), స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఇతర పరీక్షల కోసం రెసిడెన్షియల్ విధానంలో 5 నెలలపాటు శిక్షణనిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి పి.నేతానియల్, స్టడీ సర్కిల్ డైరెక్టర్ బండ శ్రీనివాస్‌లు తెలిపారు. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై, టీఎస్‌పీఎస్సీ నియమ నిబంధనల ప్రకారం అర్హులైన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఎస్సీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించరాదు. తహసీల్దార్ ధ్రువీకరించిన కులం, ఆదాయ సర్టిఫికెట్లు ఉండాలి. www.trrt ud ycirce.co.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. రూ.1,500 విలువైన స్టడీ మెటీరియల్ ఇవ్వడంతోపాటు భోజన ఖర్చుల కింద రోజుకు రూ.75 చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. మే 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. 21న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. వివరాలకు 98852 18053 ,94943 38550 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.

బీసీ స్టడీ సర్కిల్ పరిధిలో..

రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే బీసీ స్టడీ సర్కిల్‌ను ఉజ్వల పార్కులో గతేడాది ప్రారంభించారు. ఇప్పుడు గ్రూప్–1, 2, 3, 4తోపాటు బ్యాంకింగ్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షలకు హాజరయ్యే నిరుద్యోగ అభ్యర్థులకు ఉపకార వేతనంతో కూడిన ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ మంతెన రవికుమార్ తెలిపారు. అభ్యర్థులకు టీ, స్నాక్స్ కోసం రూ.75 చొప్పున ఇస్తున్నారు. ఉచిత శిక్షణకు నిరుద్యోగులు 0878–2268686 ఫోన్ నంబర్‌లో గానీ, పని వేళల్లో బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో గానీ సంప్రదించాలని కోరారు.

ఎస్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో..

ఎస్టీ అభ్యర్థులకు గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గతంలో ప్రవేశ పరీక్ష నిర్వహించి, వంద మంది అభ్యర్థులకు శిక్షణనిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి రాగానే మరో వంద మందిని ఎంపిక చేసి, శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి గంగారాం తెలిపారు.

169 మందికి ఉద్యోగాలు..



ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత తరగతులు 2016 నుంచి ప్రారంభమై, పది బ్యాచ్‌లు పూర్తయ్యాయి. రెండు బ్యాచ్‌లు నాన్ రెసిడెన్షియల్‌లో, ఎనిమిది బ్యాచ్‌లు రెసిడెన్షియల్‌లో తరగతులు కొనసాగాయి. ప్రస్తుతం స్టడీ సర్కిల్ నుంచి కోచింగ్ తీసుకున్న వారిలో 169 మందికి వివిధ రకాల ఉద్యోగాలు వచ్చాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా పరిధిలోని నిరుద్యోగ అభ్యర్థుల కోసం మళ్లీ నోటిఫికేషన్ విడుదలైంది. నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి.

– బండ శ్రీనివాస్, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్

సచివాలయం ప్రారంభోత్సవంలో జిల్లా నేతలు


సచివాలయం ప్రారంభోత్సవానికి హాజరైన నాయకులు


సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు

సిరిసిల్ల : హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన బీ.ఆర్.అంబేడ్కర్ నూతన సచివాలయం ప్రారంభోత్సవంలో జిల్లా నాయకులు పాల్గొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, రజకసంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్, ముస్తాబాద్ ఎంపీపీ జనగామ శరత్ రావు, బీఆర్‌ఎస్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, న్యాలకొండ రాఘవరెడ్డి, జక్కుల నాగరాజు యాదవ్, రాపెల్లి కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు. సచివాలయ భవనంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌కు ప్రత్యేక చాంబర్‌ను కేటాయించారు.

ఎమ్మెల్యే రమేశ్‌బాబు అభినందనలు..

వేములవాడ : నూతన సచివాలయం ప్రారంభోత్సవం అనంతరం వేములవాడ ఎమ్మెల్యే రమేశ్ బాబు సీఎం కేసీఆర్‌ను కలిశారు. అనంతరం అభినందనలు తెలియజేశారు.

ప్రధాని నోట 'రాజన్న' గుడి మాట


మన్‌కీబాత్‌లో మాట్లాడుతున్న ప్రధాని నరేంద్రమోడీ

వేములవాడ : ప్రధాని నరేంద్రమోడీ వేములవాడ రాజన్న గుడి దక్షిణకాశీ అంటూ మాట్లాడటంతో తెలంగాణవాసులు, రాజన్న భక్తులు సంబరపడుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని కాశీతో సమానంగా వేములవాడలోని రాజన్న ఆలయంలో నిశీపూజ నిర్వహిస్తుంటారు. అందుకే దక్షిణకాశీగా వేములవాడ రాజన్నగుడి నామకరణం వచ్చిందని అర్చకులు పేర్కొన్నారు. మన్‌కీబాత్‌లో రాజన్న గుడిపై ప్రధాని మాట్లాడటంపై సంతోషం వ్యక్తంచేస్తున్నారు. ప్రధాని మోడీ మాట్లాడిన వీడియోను పలువురు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తున్నారు.

'గోప' అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న అమరగాని శ్రీనివాస్‌గౌడ్

కోరుట్లటౌన్: గౌడ అఫిషియల్స్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(గోప) అభివృద్ధికి కృషి చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమరగాని శ్రీనివాస్‌గౌడ్, కార్యవర్గ సభ్యుడు బత్తిని సత్యనారాయణగౌడ్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు దుర్గపు రవీందర్‌గౌడ్ కోరారు. పట్టణంలో ఆదివారం జరిగిన కోరుట్ల మండల కమిటీ ఎన్నికల సందర్భంగా ఆయన మాట్లాడారు. లక్ష్య సాధనకు సభ్యులు సంఘటితం కావాలని కోరారు. సభ్యత్వ నమోదుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంబటి రాజయ్యగౌడ్, గుర్రం సత్యనారాయణగౌడ్, బాలుసాని సత్తయ్యగౌడ్, దుర్గపు శ్రీనివాస్‌గౌడ్, తిరుమల సదాశివగౌడ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఎల్లారెడ్డిపేటలో గురువులతో పూర్వ విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన 1987–88 పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం పాఠశాలలో నిర్వహించారు. అలాగే అల్మాస్‌పూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన 1998–99 పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని పాఠశాలలో నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పూజం భూమరాజు, కదిరె శ్రీనివాస్, బుర్క బాబ్జీ, రామచంద్రం, వెంకట్ రెడ్డి, యాదగిరి, నరేశ్, రాజేశం, తిరుపతి రెడ్డి, జీవన్ రెడ్డి, కృష్ణ, సంతోష్, హుస్సేన్, రామస్వామి, నాగసుధ, రజిత, జ్యోతి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మెట్‌పల్లి : మండలంలోని మేడిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2002–03లో చదివిన పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకొని వారి అనుభవాలను పంచుకున్నారు. ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ పీసు తిరుపతి రెడ్డి, ఉపాధ్యాయులు సుదర్శన్, చిన్నయ్య, లక్ష్మణ్, బాలకిషన్, మహేందర్ ఉన్నారు.

నెరవేరిన 'కాంట్రాక్టు'ల కల

- రెగ్యులరైజ్ చేస్తూ ఆదేశాలు
- కాంట్రాక్ట్ అధ్యాపకుల హర్షం
- జిల్లాలో 145 మందికి ప్రయోజనం


సిరిసిల్ల కళాశాలలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

సిరిసిల్ల: ప్రభుత్వ కళాశాలల్లో ఏళ్ల తరబడి విద్యాబోధన చేస్తూ.. అరకొర వేతనాలతో వెళ్లదీస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల కల నెరవేరింది. బీఆర్ అంబేడ్కర్ నూతన సచివాలయ భవన ప్రారంభోత్సవం సందర్భంగా కాంట్రాక్ట్ అధ్యాపకులు, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం జీవో జారీ చేసింది. ఈ జీవో ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా 40 విభాగాల్లోని 5,544 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశారు. జిల్లాలోని 95 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులతోపాటు ఇతర విభాగాల్లోని మరో 50 మంది వరకు ఉద్యోగులకు ప్రయోజనం దక్కింది.

ఇదీ కాంట్రాక్ట్ అధ్యాపకుల కథ

రెండు దశాబ్దాలకు పైగా ప్రభుత్వ కళాశాలల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేస్తూ 2016 ఫిబ్రవరి 26న తెలంగాణ ప్రభుత్వం జీవో జారీచేసింది. దీనిపై కొందరు కోర్టుకెళ్లడంతో క్రమబద్ధీకరణ నిలిచిపోయింది. 2017 జూన్ 16న కాంట్రాక్ట్ అధ్యాపకుల వేతనాన్ని రూ.18,000 నుంచి రూ.37,100 బేసిక్ చేస్తూ జీవో జారీ చేసింది. కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఏడాదిలో పది నెలలు జీతాలు ఇస్తూ రెండు నెలలు ఇవ్వకపోయేది. దీన్ని సవరిస్తూ 12 నెలలు జీతాలు ఇచ్చేలా జీవో 222ని 2018 సెప్టెంబరు 5న జారీ చేసింది. పీఆర్సీని వర్తింపజేస్తూ 2021 జూన్ 17న జీవో నంబరు 105ను జారీ చేసింది. దీంతో వీరి వేతనాలు రూ.37,100 నుంచి రూ.54,200లకు చేరింది. డిగ్రీ, పాలిటెక్నిక్ కాంట్రాక్ట్ అధ్యాపకులకు సైతం వేతనాలు పెంచుతూ జీవో జారీ చేసింది. దీంతో వారి వేతనాలు సైతం రూ.40,270 నుంచి రూ.58,850కి చేరింది. తాజాగా ప్రభుత్వం జారీ చేసిన జీవోతో కాంట్రాక్ట్ అధ్యాపకులు అందరూ ప్రభుత్వ ఉద్యోగులుగా గౌరవం పొందనున్నారు.

సిరిసిల్లలో సంబరాలు

ప్రభుత్వ జీవోపై సిరిసిల్ల జూనియర్ కళాశాలలో ఆదివారం కాంట్రాక్ట్ అధ్యాపకులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శనిగరం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జిల్లా సుమన్, వివేక్, లక్ష్మణ్, ఆంజనేయులు, నవీన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భూమేశ్, శ్రీనివాస్, యాదగిరి, తిరుపతి, వేణు పాల్గొన్నారు.

మా జీవితాల్లో వెలుగులు



నేను సిరిసిల్ల బాలిక కళాశాలలో ఐదేళ్లు ఫిజిక్స్ అధ్యాపకుడిగా కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేశాను. ప్రస్తుతం 17 ఏళ్లుగా ఎల్లారెడ్డిపేటలో పనిచేస్తున్నాను. రెగ్యులర్ చేయడంతో మా జీవితాల్లో వెలుగులు వచ్చాయి.

– శనివారం శ్రీనివాస్, కాంట్రాక్ట్ లెక్చరర్

ఇప్పటికీ గుర్తించారు



నేను ఇల్లంతకుంట ప్రభుత్వ కళాశాలలో తెలుగు బోధిస్తాను. 23 ఏళ్లుగా పనిచేస్తున్నాం. సమాన పనికి సమాన వేతనం లేక చాలా ఇబ్బందులు పడ్డాం. మా కష్టాన్ని ఇప్పటికీ గుర్తించారు.

– పి.యాదగిరి, ఇల్లంతకుంట

కల నెరవేరింది



నేను రుద్రంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మ్యాథ్స్ బోధిస్తాను. ఎన్నో ఆశలతో కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పనిచేస్తున్నాం. రెండు దశాబ్దాలుగా ఉద్యోగాల క్రమబద్ధీకరణ కోసం నిరీక్షిస్తున్నాం. ఎట్టకేలకు కల నెరవేరింది. సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం.

– జిల్లా సుమన్, రుద్రంగి

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జగిత్యాల క్రైం : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల పట్టణ శివారులోని ఉప్పరిపేటకు చెందిన కటారి అంజిత్‌రావు (46) అతడి స్నేహితుడు సామ సందీప్ ఏప్రిల్ 29న తాటిపల్లి గ్రామానికి పనినిమిత్తం వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా జగిత్యాల రూరల్ మండలం..చల్‌గల్ గ్రామ శివారులోని జగిత్యాల – నిజామాబాద్ ప్రధాన రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో కింద పడ్డారు. ఈ ప్రమాదంలో అంజిత్‌రావుకు తీవ్ర గాయాలుకాగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి భార్య సుప్రజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు.

ట్రాక్టర్ కిందపడి చిన్నారి..


రుత్విక అలియాస్ పప్పి (ఫైల్)

తంగళ్లపల్లి (సిరిసిల్ల) : ట్రాక్టర్ కిందపడి ఏడేళ్ల చిన్నారి మృతిచెందిన సంఘటన మండలంలోని అంకుషాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అంకుషాపూర్‌కు చెందిన ముద్దం స్వరూప–సురేశ్ దంపతులకు కూతురు ముద్దం రుత్విక అలియాస్ పప్పి (7), ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లిదండ్రులిద్దరూ కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో హద్దురాళ్లు పాతేందుకు ఆదివారం కూలీకి వెళ్లారు. తమతోపాటు రుత్వికను వెంట తీసుకెళ్లారు. తల్లిదండ్రులు హద్దురాళ్లు పాతే పనిలో నిమగ్నమవగా చిన్నారి రుత్విక ట్రాక్టర్‌పై డ్రైవర్ పక్కన కూర్చుంది. హద్దురాళ్లు గుంతల వద్ద వేసేందుకు ట్రాక్టర్‌ను ముందుకు నడపడంతో రుత్విక ట్రాక్టర్ పైనుంచి కిందపడింది. ఈ విషయాన్ని డ్రైవర్ గమనించలేదు. దీంతో టైరు చిన్నారి పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందింది. కళ్లముందే కూతురు మృతిచెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. చిన్నారి మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు


చికిత్స పొందుతున్న సదయ్య

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని రాఘవాపూర్ గ్రామానికి చెందిన బూషనవేని సదయ్య అనే గీత కార్మికుడు ఆదివారం తాటి చెట్టు పైనుంచి పడి గాయపడ్డాడు. స్థానికులు గమనించి, పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తీసుకెళ్లారు. నిరుపేద కుటుంబానికి చెందిన సదయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని గీత కార్మిక సంఘం నాయకులు కోరారు.

ఒకరి బలవన్మరణం

గోదావరిఖని(రామగుండం): గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందిరానగర్‌కు చెందిన భూతల కిశోర్‌రెడ్డి(50) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులతోనే అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కమలాకర్ పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు భార్యలు, నలుగురు పిల్లలున్నారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి


నివాస్‌రెడ్డి (ఫైల్)

గన్నేరువరం : హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని సాంబయ్యపల్లె గ్రామానికి చెందిన గడ్డం రాజిరెడ్డి – మంజుల దంపతులకు ఇద్దరు కుమారులు గడ్డం ప్రభాస్ రెడ్డి, గడ్డం నివాస్ రెడ్డి ఉన్నారు. పెద్ద కుమారుడిది బీటెక్ పూర్తికాగా విదేశాలకు వెళ్లే ప్రయత్నంలో ఉన్నాడు. రెండో కుమారుడు నివాస్‌రెడ్డి (20) హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఏప్రిల్ 28న జన్మదిన వేడుకలు జరుపుకున్నాడు. శనివారం రాత్రి స్నేహితుడి జన్మదిన వేడుకల్లో పాల్గొనేందుకు ఉప్పల్‌కు చేరుకున్నాడు. వేడుకల మధ్యలో నిజామాబాద్ జిల్లాకు చెందిన మరో స్నేహితుడిని గదిలో వదిలిపెట్టేందుకు నివాస్‌రెడ్డి అతనితో కలిసి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యలో ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందారు. స్నేహితులు గదిలో ఉన్న సతీశ్‌కు ఫోన్‌చేయగా రాలేదని చెప్పడంతో పోలీసులు ద్వారా మరణవార్తను తెలుసుకొని సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

సాంబయ్యపల్లెలో విషాదం..

గడ్డం రాజిరెడ్డిది రైతు కుటుంబం. కూరగాయలు, ఇతర పంటలు సాగు చేస్తూ ఇద్దరు కుమారులను ఉన్నత చదువులు చదివిస్తున్నాడు. కొడుకు మృతిచెందాడని ఆదివారం ఉదయం ఫోన్ ద్వారా సమాచారం అందడంతో వారు బోరున విలపించారు. నివాస్‌రెడ్డి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. మృతదేహాన్ని గ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

ఎలక్ట్రికల్ వైండింగ్ వర్కర్స్ అసోసియేషన్ కార్యవర్గం

విద్యానగర్(కరీంనగర్): ఎలక్ట్రికల్ వైండింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎన్నికలు ఆదివారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా కాయితోజు పవన్‌కుమార్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా దొంత రవీందర్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా బి.శ్రీనివాస్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా సాజిద్, పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడిగా ఖలీల్ పాషాలను సభ్యులు ఎన్నుకున్నారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కంది కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఎలక్ట్రికల్ వైండింగ్ వర్కర్స్ సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. వైండింగ్ పని చేస్తున్నప్పుడు కరెంట్ షాక్ వల్ల చాలా మంది కార్మికులు చనిపోతున్నారని, ఎంతోమంది అంగవైకల్యం పొందుతున్నారని తెలిపారు. అలాంటి వారిని ఆదుకోవాలని కోరారు.